
# 'స్టాల్' వర్ట్



ఆ సెక్షన్‌లో మీరెప్పుడైనా పొగబండిలో ప్రయాణం చేశారా?
చేసుంటే కోటయ్యను చూసుంటారు.
కోటయ్యంటే...

# పొగబండి కథలు

- ఓలేటి శ్రీనివాసభాను



వేలాడే ఇనప తీగె గుత్తిలో ఊగే పలకల గాజు గ్లాసులు.
కొబ్బరిలా కొరికి తినాలనిపించే పింగాణీ కప్పులూ, సాసర్లూ.
రాజుకొన్న రాక్షసి బొగ్గుల పొయ్యీ, పొగా, వేడీ.
దంచిన అల్లం, యాలకులూ.. మరిగించిన పాలూ, టీపొడీ
కోటయ్యంటే-
'చాయ్... గరం గరం చాయ్'

కోటయ్య స్టాల్ తెరిస్తేనే ఆ ప్లాట్ ఫారం కళ్లు తెరిచేది. నైట్‌డ్యూటీ స్టేషన్ స్టాఫ్‌కీ, నైట్ జర్నీ ప్యాసింజర్లకీ నాలుక తడిసేది.

అది వాటరింగ్ స్టేషన్. అక్కడ స్టీమ్ ఇంజన్లు నీళ్లకు బదులు కోటయ్య టీ తాగి వుంటే- అప్పట్లోనే మన బళ్లు బులెట్ ట్రయిన్‌ని మించిపోయుండేవి.

ఊరు తెల్లారకముందే ప్లాట్‌ఫారమ్ మీద రాక్షసి బొగ్గుల పొగ ఒత్తుగా, వయ్యారంగా మెలికలు తిరిగిందంటే, వాచీ చూసుకోనవసరం లేదు, అయిదు గంటలయిందని అర్థమైపోతుంది. అప్పుడు ఎర్రగా రెప్పలు తెరుచుకున్న కోటయ్య పొయ్యి రాత్రి పది వరకూ నుసి రాలుస్తూనే వుంటుంది. గరం గరం చాయ్‌ని ఘాటుగా అందిస్తూనే వుంటుంది. పగలంతా ఆ స్టేషన్ వచ్చే బండి, పోయే బండితో కలివిడిగా వుంటుంది. అపురూపంగా డీజిల్‌తో నడిచే ఓ జత ఎక్స్‌ప్రెస్ బళ్లూ, ఒకటీ అరా గూడ్సు బళ్లూ తప్ప పొగబళ్లన్నీ వాటరింగ్‌కి ఆగాల్సిందే... డ్రైవర్లూ, ఫైర్ మెన్లూ, టీసీలు, గార్డులూ-ప్యాసింజర్లతో పాటు కోటయ్య టీని తాగాల్సిందే!

రైల్వే స్టాఫ్ దగ్గర మొదట్లో కోటయ్య డబ్బులు తీసుకునేవాడు కాదు. ఇవ్వ జూపితే నవ్వుతూ నమస్కరించేవాడు. కానీ, కొలత పట్టినట్లుగా గ్లాసుకి సగం-'సింగిల్ చాయ్' మాత్రమే పోసేవాడు. కోటయ్య టీలోని విశేషం-రుచి మరిగిన రైల్వేస్టాఫ్‌కి గీటు ఆగేది కాదు.

''పోయ్ కోటయ్యా పోయ్'' అని గ్లాసు నిండా అడిగి పోయించుకుని, సింగిల్ చాయ్‌కి డబ్బులిచ్చేవాళ్లు. అలా కోటయ్యకి రాబడీ వుండేది, రైల్వే స్టాఫ్‌కి తృప్తీ మిగిలేది.

రాక్షసి బొగ్గులు రాజెయ్యడంలో టెక్నిక్ వుంది. కోటయ్య అందులో నిష్ణా

తుడు. ఎండైనా, వానయినా, ఏ కాలంలోనయినా కోటయ్య అగ్గిపుల్ల గీశాడంటే సింగిల్ టేక్‌లో పొయ్యి భగభగలాడాల్సిందే. రక్షణ దళాలకి ఆయుధాగారంలా కోటయ్య గోనె బస్తాల్లో పిడక ముక్కలూ, కాటన్ వేస్టూ వుండేవి. కిరసనాయిలు సీసా సరేసరి. బొగ్గూ, కాటన్ వేస్టూ ఫ్రీగా వచ్చేవి. స్టీమ్ ఇంజన్ దగ్గరకి పాత దేవదారు పెట్టెను తీసుకెళ్తే ఫైర్‌మెన్లు ఆ పెట్టె నిండా పోసేవారు.

పొయ్యి వెలిగించడంలో ఎంత శ్రద్ధ తీసుకునేవాడో, టీ కలపడంలోనూ అంత శ్రమా తీసుకొనేవాడు కోటయ్య. ముఖ్యంగా పాల విషయంలో అతను రాజీ పడేవాడు కాదు. చిక్కటి పాల కోసం సొంతంగా గేదెలు పెంచేవాడు. కోటయ్య భార్య వాటికి సేవలు చేసేది. పచ్చగడ్డి కోసుకురావడం, సంత కోనేట్లో గేదెల్ని కడగడం, బెల్లం, తెలక పిండీ, తవుడూ కలిపి కుడితి పెట్టడం లాంటి సేవలతో ప్లాట్‌ఫారమ్మీద కోటయ్యకి తీసిపోకుండా తెరవెనక ఆవిడ శ్రమించేది. ప్లాట్‌ఫారమ్మీద కోటయ్య టీస్టాల్ పక్కా బిల్డింగేం కాదు. అప్పటికప్పుడు నిలబెట్టే బొమ్మల కొలువు. అందులో చెక్క బల్లలుండేవి. గాజు అద్దాల గూడు వుండేది. ఆ గూట్లో బన్నులూ, బిస్కెట్లూ తప్ప మరొకటి వుండేవి కాదు. కోటయ్య తలుచుకుంటే, ఇడ్లీలూ, దోసెలూ చేసేవాడే. పూరీలూ, పుణుకులూ, బజ్జీలూ, పకోడీలూ ఏవి పెట్టినా వేడి చల్లారకముందే చెల్లిపోయేవే. కానీ కోటయ్య వాటి జోలికి పోలేదు. అతనికి మార్కెటింగ్‌లో డిగ్రీలు లేవు. డాక్టరేట్లూ లేవు. కానీ, స్పెషలైజేషన్ అంటే ఏంటో తెలుసు. బ్రాండింగ్‌లోని లాభాలు తెలుసు. అందుకే అతను టీ మీదే దృష్టి పెట్టాడు. టీ కోటయ్యగానే స్థిరపడిపోయాడు.

కోటయ్య టీ కలుపుతున్నప్పుడు చూడాలి. ముఖ్యంగా శీతాకాలం తెల్లవారగట్ల చూస్తే ఆ అనుభూతి వేరు. రైలు ప్రయాణం తాలూకు జ్ఞాపకాలన్నీ కలగలిపి కప్పు నిండా టీ అందించినట్లనిపిస్తుంది. పాత రైల్వే కోటు, తలకి మఫ్లరు, కావిదేరిన పాత ఫిల్ములాగా మనసు తెర మీద కోటయ్య రూపం కదలాడుతుంది. కోటయ్య టీ కెటిల్ రైల్వే మ్యూజియంలో ఉంచాల్సిన అపురూప వస్తువు. అది కుంపటి మీద కుతకుతలాడుతున్నప్పుడు గుడ్లను పొదుగుతున్న బాతులాగా కనిపించేది.

కెటిల్ కడుపులో మరిగే తేయాకు అణువులు విస్ఫోటించి, కెటిల్ ముక్కులోంచి అద్భుతమైన రుచిని ఆవిరి రూపంలో ఆవిష్కరించడం అదో కవితా వస్తువు! వర్షాకాలంలో వాతావరణం బరువెక్కినప్పుడు కోటయ్య స్టాల్‌లోని అద్దాల గూట్లో బన్నులు, బిస్కెట్లూ మెత్తబడ్డాయేమోగానీ, కోటయ్య కెటిల్ మాత్రం ఉష్ణకుండమే!

అలా కొన్నేళ్లు.... టీని నమ్ముకొని ప్రయాణీకులూ, అమ్ముకొని కోటయ్యా బతికారు. కొన్నాళ్లకి ఆ స్టేషన్ దశ తిరిగింది. గాలి పటానికి తోకలాగా బ్రాంచ్ లైన్ రావడంతో 'జంక్షన్' యోగం పట్టింది. దగ్గర్లో ఏదో పెద్ద ఫ్యాక్టరీ రావడంతో ఊరూ, రైల్వే ట్రాఫిక్కూ బాగా పెరిగాయి. ప్లాట్‌ఫారం సుత్తి దెబ్బలు పడిన రేకులాగా అటూ ఇటూ సాగింది. కోటయ్యని దెబ్బతీసింది. పండ్లూ, పత్రికలూ అమ్మే దుకాణాలొచ్చాయి. కాంట్రాక్ట్ పద్ధతి మీద వి.ఆర్.ఆర్-వెజిటేరియన్ రిఫ్రెష్‌మెంట్ రూమ్ వచ్చింది. టిఫిన్లూ, టీ కాఫీలూ, భోజనాలూ గట్రా అక్కడే.. అందులోనే....

కోటయ్య పొయ్యి లేదు... టీ కెటిలూ లేదు...
అద్దాల గూట్లో బన్నులూ, బిస్కెట్లూ లేవు...
అసలు కోటయ్య స్టాలే లేదు.

కానీ విచిత్రం...

కోటయ్య టీ వాసన మాత్రం ఆ ప్లాట్‌ఫారం గాల్లో వేలాడుతూనే వుంది.

ఇప్పుడు వెళ్లి చూడండి...

టీసీ నిలబడే గేటు బయట ఇనపరేకుల్లోంచి కోటయ్య నల్లని శరీరం, వెండిజుట్టు నెగెటివ్ లాగా కనిపిస్తాడు. అతని దగ్గర ఇనపతీగెల గుత్తిలో ఊగే పలకల గాజు గ్లాసులు కనిపించవు. కొబ్బరిలాగా కొరుక్కు తినాలనిపించే పింగాణీ కప్పులూ, సాసర్లూ లేవు. రాక్షసి బొగ్గుల పొయ్యీ, పొగా-వాటి ఆనవాళ్లే వుండవు.

కానీ, కోటయ్య కనిపిస్తాడు. అతని చేరో భుజానికి వేలాడుతూ పెద్ద ఫ్లాస్కులు... మెడలో క్యారీ బ్యాగు నిండా డిస్పోజబుల్ కప్పులు...

బండి ప్లాట్‌ఫారమ్మీదకి రాగానే గేటు అవతల కటకటాల దగ్గరికి కోటయ్య మొబైల్ స్టాల్ నడిచొస్తుంది. ప్లాట్‌ఫారమ్మీద కాంట్రాక్టర్ స్టాల్ వైపు కన్నెత్తి చూడని ప్రయాణీకులు కటకటాల దగ్గరకి వెళ్తారు. కోటయ్య టీని ఆత్రంగా అందుకొంటారు.

కోటయ్య ఇప్పటికీ రైల్వే స్టాఫ్ దగ్గర డబ్బులు తీసుకోడు. ఇవ్వజూపితే నవ్వుతూ నమస్కరిస్తాడు.

అవును మరి-టీకీ, రైలు బండికీ అనుబంధం వుంది. మరుగుతున్న టీ కెటిల్ ఆవిరి యంత్రానికి ఆలోచన పోసింది. కోటయ్య టీ ఆ వారసత్వాన్ని కొనసాగిస్తోంది. ప్లాట్‌ఫారమ్ మీద బతికిన రోజుల్లోని ఆనందం, ఆత్మవిశ్వాసం-అల్లం, యాలకుల సువాసనల్లాగా-నేటికీ కోటయ్య టీలో, గుండెలో పరిమళిస్తూనే వున్నాయి.

*

